www.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

సంపుటి : 01 | సంచిక : 16 (కాంప్లిమెంటరీ కాపీ) | శనివారం | 20.04.2024



## పకడ్బందీగా ఈవీఎంల తరలింపు

- పరిశీలించిన కలెక్టర్ రిజ్వాన్ బాషా

2



## కడియం కావ్యను గెలిపిద్దాం..

- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే శ్రీహరి

3



## భువనగిరికి తరలిన ఎర్ర దండు..

- జహంగీర్‌ను గెలిపించాలి : మోకు

3



# ఎర్రకోటపై కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం

- మానుకోట కాంగ్రెస్ కంచుకోట
- రాష్ట్రానికి బీజేపీకి ఏం చేసింది.. ఎందుకు ఓటెయ్యాలి?
- విభజన హామీలు నెరవేర్చలేదు
- ఆగస్టు 15 లోపు రుణమాఫీ.. వచ్చే సీజన్ నుంచి రైతులకు రూ.500 బోనస్
- మహబూబాబాద్ సభలో సీఎం రేవంత్ రెడ్డి

**మహబూబాబాద్, మన చౌరాస్తా :**

దేశంలో ప్రజాస్వామ్యాన్ని రక్షించడానికి లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం చాలా అవసరమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఈసారి ఎర్రకోటపై కాంగ్రెస్ జెండా ఎగురుతుందని, రాహుల్‌గాంధీ ప్రధానిగా ప్రమాణస్వీకారం చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం మహబూబాబాద్‌లో నిర్వహించిన కాంగ్రెస్ జనజాతర సభలో సీఎం రేవంత్ ప్రసంగించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, ఫామ్ హౌస్ కేడీ తెలంగాణను దోపిడీ చేశారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపణలు చేశారు. మానుకోట కాంగ్రెస్ పార్టీకి ఎప్పటికీ కంచుకోట అన్నారు. 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో మహబూబాబాద్ ప్రాంతం విధ్వంసమైందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ తెచ్చిన చట్టాలకు కేసీఆర్ మద్దతు తెలిపారని అన్నారు. బయ్యారం ఉక్కు కర్మాగారాన్ని

మిగతా2లో..

General News



# ఎర్రకోటపై కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం

**▶▶ మొదటిపేజీ తరువాయి**

మోదీ ప్రభుత్వం పక్కకు పెట్టిందని మండిపడ్డారు. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ సోనియా గాంధీ మంజూరు చేస్తే.. మోడీ లాథూర్‌కు తరలించుకుపోయారని విరుచుకుపడ్డారు. ములుగు గిరిజన యూనివర్సిటీని సోనియా గాంధీనే మంజూరు చేశారని గుర్తుచేశారు. విభజన చట్టం ప్రకారం.. రాష్ట్రానికి ప్రకటించిన హామీలను బీజేపీ సర్కారు నెరవేర్చలేదన్నారు. ఈ ప్రాంత ప్రజలను ఓటు అడిగే హక్కు బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకి లేదని చెప్పారు. తల్లిని చంపి బిడ్డను ఇచ్చారని మోడీ తెలంగాణను అవమాన పరిచారని ధ్వజమెత్తారు. అప్పుడు పార్లమెంట్ లోతానే ప్రత్యక్ష సాక్షినని గుర్తుచేశారు. ఉత్తర భారతదేశంలోని కుంభమేళాకు మోడీ వేల కోట్లు ఖర్చు చేశారని.. మేడారం జాతరకు కేవలం రూ.3 కోట్లు ఇచ్చారని దుయ్యబట్టారు. మేడారం మహాజాతరకు జాతీయ గుర్తింపు ఇవ్వబోమని చెప్పిన బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి ఓట్లు అడగడానికి సిగ్గు లేదా అని ప్రశ్నించారు. కేసీఆర్ బిడ్డ కవిత బెయిల్ కోసం బీఆర్ఎస్‌ను కేసీఆర్ మోడీకి తాకట్టు పెట్టారని ఆరోపించారు. 100 రోజుల్లో ఐదు గ్యారంటీలు అమలు చేశామని సీఎం తెలిపారు. మరో పదేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందన్నారు. ఆగష్టు 15వ తేదీలోగా రైతులకు రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేస్తామని, వచ్చే పంటల కొనుగోలుకు రూ.500 బోనస్ ఇస్తామని హామీ ఇచ్చారు. తండ్రి రెడ్యానాయక్‌ను ఇంటికి పంపినట్టే.. బిడ్డ మాలోతు కవితను కూడా ఇంటికి పంపాలని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మానుకోట ఎంపీ అభ్యర్థి బలరాం నాయక్, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా ఈవీఎంల తరలింపు

**– జిల్లా ఎన్నికల అధికారి రిజ్వాన్ బాషా**

జనగామ, మన చౌరాస్తా : లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో పకడ్బందీగా ఈవీఎం, వీవీ ప్యాడ్‌లను తరలించినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. శుక్రవారం జిల్లాలోని సమీకృత కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం)ల గోదాము నుంచి మూడు నియోజకవర్గాల వారీగా స్ట్రాంగ్ రూంలలో భద్రపరిచేందుకు ఈవీఎం, వీవీ ప్యాడ్‌లను తరలింపు ప్రక్రియను అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేశ్ కుమార్, సహాయ రిటర్నింగ్ అధికారి పాలకుర్తి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్, సహాయ రిటర్నింగ్ అధికారి, జనగామ ఆర్డీవో డి.కొమురయ్య, సహాయ రిటర్నింగ్ అధికారి ఘనపూర్ (స్టేషన్) ఆర్డీవో డివిఎస్. వెంకన్నలతో కలిసి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం సూచనల మేరకు బ్యాలెట్ యూనిట్స్ 1,085, కంట్రోల్ యూనిట్స్ 1,085, వీవీ ప్యాట్స్ 1,216 లను మూడు నియోజకవర్గాల వారీగా స్ట్రాంగ్ రూంలకు తరలించాలని సూచించారు. బ్యాలెట్ యూనిట్లు,




కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్ ల వివరాల స్కానింగ్ ను పకడ్బందీగా నిర్వహించి, ధృవీకరించాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి చెంచారపు శ్రీనివాసరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి రావెల రవి, బీజేపీ పార్టీ ప్రతినిధి విజయభాస్కర్, సీపీఎం పార్టీ ప్రతినిధి జోగు ప్రకాశ్, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## స్ట్రాంగ్ రూంకు చేరిన ఈవీఎంలు

స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా : జనగామ కలెక్టరేట్ కార్యాలయం నుండి ఈవీఎంలు శుక్రవారం సాయంత్రం స్టేషన్ ఘన్ పూర్ స్ట్రాంగ్ రూమ్ కు చేరాయి. రెవెన్యూ డివిజనల్ అధికారి డివిఎస్ వెంకన్న, తాసిల్దార్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తుతో స్టేషన్ ఘన్ పూర్ స్ట్రాంగ్ రూమ్ కు తరలించారు. మండల కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల స్ట్రాంగ్ రూములో ఈవీఎంలను భద్రపరిచారు. వారి వెంట ఎస్సై వినయ్ కుమార్, ఎమ్మార్ఐ అర్జున్, రవీందర్ ఇతర సిబ్బంది ఉన్నారు.



# డీఈఓకు అభినందనలు



**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** జిల్లా ఇంటర్ విద్య అధికారి (డీఈఓ)గా ఎంపికైన కె.ఆంజనేయ రాజుకు డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది అభినందనలు తెలిపారు. ఇటీవల ఇంటర్మీడియేట్ అధికారి బైరి శ్రీనివాస్ పదవీ విరమణ పొందిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో జాఫర్ ఘడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆంజనేయ రాజుకు పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ఇంటర్మీడియట్ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా డిఇఓ నియామకం పట్ల కార్యాలయ సిబ్బంది కళాశాల సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

# రక్తదాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలి

**హనుమకొండ, మన చౌరాస్తా :** హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ సుబేదారి లోని రక్త కేంద్రంలో రక్త నిల్వలు పూర్తిగా తగ్గిపోయాయని 18 సంవత్సరాలు నిండిన రక్తదాతలు స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు రావాలని రెడ్ క్రాస్ చైర్మన్, పాలకవర్గం కోరారు. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు పక్క జిల్లాల నుంచి తలసేమియా బాధితులు హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ తలసీమియా, సికిల్ సెల్ ట్రాన్స్ ఫ్యూషన్ సెంటర్ కు వచ్చి రక్తం ట్రాన్స్ ఫ్యూషన్ చేసుకుంటుంటారు. తలసీమియా బాధితులకు ప్రతి 15 రోజులకు ఒకసారి రక్తం ఎక్కించాల్సిందే లేకపోతే వారి ప్రాణానికి ముప్పస్తుంది. వేసవి కాలం దృష్ట్యా రక్త కేంద్రంలో రక్తం నిల్వలు తగ్గిపోయి రక్తం కొరత ఏర్పడి తలసేమియా బాధితులకు రక్తం ఎక్కించడానికి ఇబ్బంది గురవుతుందని తెలిపారు. ప్రస్తుతం కళాశాలలో పరీక్షల సమయం వల్ల రక్తదాన శిబిరాలు నిర్వహించడం కష్టతరం అవుతుందని, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న స్వచ్ఛంద సంస్థలు, యూత్ అసోసియేషన్లు, ఉద్యోగ సంఘాలు, యువత ముందుకు వచ్చి రక్తదాన శిబిరాలు నిర్వహించి రక్తం కొరత లేకుండా చూసి తలసేమియా బాధితులను ఆదుకోవాలని కోరారు.



# ఓటు ఎంతో విలువైంది

■ **జిల్లా స్వీప్ నోడల్ అధికారి వినోద్ కుమార్**

**జనగామ, మన చౌరాస్తా :** ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైందని, ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటును ఉపయోగించుకోవాలని జిల్లా స్వీప్ నోడల్ అధికారి వినోద్ కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని పెంబర్తిలో ఉపాధి హామీ కూలీలతో లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు స్వీప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు లిస్టులో వారి పేరు నమోదును చెక్ చేసుకోవాలని, ఎన్నికల పోలింగ్ (మే 13) తేదీన అందరూ తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా నిజాయితీగా ఓటును బాధ్యతాయుతంగా వేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు, సంబంధిత సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

Local News

# కడియం కావ్యను గెలిపిద్దాం

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** నాయకులు కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డా. కడియం కావ్యని భారీ మెజారిటీతో గెలిపించుకుందామని స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా జనగామ జిల్లా స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గ కేంద్రంలో శుక్రవారం ప్రచార వాహనాలను నియోజకవర్గ ఇంచార్జీ సింగపురం ఇందిరతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ ప్రచార రథాలు గల్లీ గల్లీ, వాడ వాడ తిరిగి ముమ్మరంగా ప్రచారం చేయాలనీ తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను, మ్యానిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించాలని అన్నారు.ఎంపీ అభ్యర్థి కావ్యను అఖండ మెజారిటీతో గెలిపించి రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కానుకగా ఇవ్వాలని శ్రేణులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జగదీష్ చంద్ర రెడ్డి, శ్రీరాములు, బిల్దే వెంకన్న, కోళ్ల రవి, గడ్డమీద సురేష్, శిరీష్ రెడ్డి, మంచాల ఎల్లయ్య, వెంకటేశ్వర్ రెడ్డి, బూర్ల శంకర్, సింగపురం దయాకర్, సింగపురం నాగయ్య, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి..

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ కాంగ్రెస్‌లోకి భారీగా వలసలు కొనసాగుతున్నాయి. శుక్రవారం జనగామ పట్టణంలోని 4వ వార్డ్ కౌన్సిలర్ మంత్రి సుమలత శ్రీశైలం, బీఆర్ఎస్ నుంచి జనగామ ముఖ్య నాయకులు ఆరుట్ల లోకమంతరెడ్డి, గుజ్జుల తుకారం, తొట్టె నర్సింగ్ యాదవ్, పట్టణ యువకులు భారీగా డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్ రెడ్డి, మేడ శ్రీనివాస్, జనగామ మండల అధ్యక్షుడు లింగాల నర్సిరెడ్డి, ధర్మ గోవర్ధన్ రెడ్డి, కాగితపురం మహేందర్ రెడ్డి, రాజిరెడ్డి, బచ్చన్నపేట మండల అధ్యక్షుడు నూకల బాల్ రెడ్డి, కుమార్, రవీందర్, అనిల్, అఖిల్ పాల్గొన్నారు.



# విద్యుత్ ఉద్యోగులకు శిక్షణ

**జనగామ, మన చౌరాస్తా :** విద్యుత్ శాఖ సీఎండీ ఆదేశాల మేరకు సబ్ డివిజన్ల వారిగా విద్యుత్ శాఖ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం దేవరుప్పుల సబ్ డివిజన్ సిబ్బందికి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బిల్లింగు, రెవెన్యూ వసూళ్లు, విద్యుత్ లైన్ లో పర్యవేక్షణ, నిర్వహణ లోపాలను సరి చేయడం, ట్రాన్స్ ఫార్మర్ల నిర్వహణ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డైరెక్టర్ సదర్ లాల్, ఎస్ఈ టి.వేణుమాధవ్, డీఈలు ఎం.లక్ష్మీనారాయణ రెడ్డి, విజయ్ కుమార్, డీఈ(టీ) ఇంచార్జ్ ప్రభావతి, ఏడీఈ అనిల్ కుమార్, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

# సభా స్థలి పరిశీలన

**హనుమకొండ, మన చౌరాస్తా :** ఈ నెల 24న కాజీపేట మండలం మడికొండలో నిర్వహించనున్న వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ భారీ భహిరంగ సభా స్థలాన్ని పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి గారు, మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారు, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు గారు పరిశీలించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు హాజరువనున్న నేపథ్యంలో సభ ఏర్పాట్లపై చర్చించారు. సభ ఏర్పాట్లలో ఎక్కడా ఎలాంటి లోటు పాట్లు లేకుండా, సభకు వచ్చే ప్రజలకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా చూడాలని నేతలకు సూచించారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రజలు భారీగా తరలివచ్చి భహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు.





# కదిలిన ఎర్రదండు

- సీఎం అభ్యర్థి జహంగీర్ గెలిపించండి
- జనగామ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి

**జనగామ, మన చౌరాస్తా :** పేదల పెన్నిధి, పోరాటల వారధి నిరంతరం ప్రజా సమస్యల వైపు, ప్రజల హక్కుల కోసం నిలబడి పోరాడే భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం సీపీఎం అభ్యర్థి యం.డి జహంగీర్ గెలిపించాలని ఆ పార్టీ జనగామ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం జహంగీర్ నామినేషన్ సందర్భంగా రోడ్డు షో, బహిరంగ సభకు జనగామ నియోజకవర్గంలోని అన్ని మండలాల భారీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా కనకారెడ్డి పార్టీ జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మహత్తర తెలంగాణ రైతాంగ పోరాట వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న సిపిఐ(ఎం) పార్టీ దేశ రాజకీయాల్లో విశిష్ట స్థానాన్ని సంపాదించుకున్నదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, దేశ సమగ్రఅభివృద్ధి, ప్రజాస్వామ్య హక్కులు, లౌకిక విలువలు, రాజ్యాంగం పునాదుల పరిరక్షణ కోసం, దేశ ప్రయోజనాల కోసం కమ్యూనిస్టుల అవసరం ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతైనా ఉందన్నారు. అందుకే సుత్తి కొడవలి నక్షత్రం గుర్తు పై ఓట్లు వేసి సిపిఐ(ఎం) పార్టీ అభ్యర్థి జహంగీర్ గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ట్రాన్స్పోర్ట్ రంగం రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్, పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు, సాంబరాజు యాదగిరి, ఇర్రి అహల్య, సింగారపు రమేష్, జిల్లా కమిటీ సభ్యులు జోగు ప్రకాష్, సుంచు విజేందర్, బోడ నరేందర్, బెల్లంకొండ వెంకటేష్, పోత్కనూరి ఉపేందర్, టి. దేవదానం, కె.లింగం పాల్గొన్నారు.



# కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

**దేవరుప్పుల, మన చౌరాస్తా :** మండల కేంద్రంలోని కొత్తవాడలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం మద్దతు ధరలకు విక్రయించాలని,దళారులను ఆశ్రయించి తక్కువ ధరలకు అమ్ముకోవద్దని సూచించారు. వారం రోజుల నుండి ఎండలు ఎక్కువగా ఉన్నాయి కాబట్టి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని,వడదెబ్బకు గురికాకుండా ఓఆర్ఎస్ ద్రావణాన్ని తీసుకోవాలని రైతులకు సూచించారు.



# లక్నో గ్రాండ్ విక్టరీ

**మన చౌరాస్తా క్రీడా విభాగం :**

టీ20 మ్యాచ్ అంటేనే చిత్తుబొత్తు టైపు. ఏదైనా జరగొచ్చు. ఏ క్షణంలోనైనా మ్యాచ్ మలుపు తిరగవచ్చు. ఊహించని ఫలితం రావొచ్చు. కానీ అందుకు భిన్నంగా అన్ని రంగాల్లో ఆధిపత్యం వహిస్తూ ఓ జట్టు గెలవడం అంత ఈజీ కాదు. దీన్ని సంపూర్ణ ఆధిపత్యం అంటారు. తాజాగా చెన్నై పై లక్నో ఇలాంటి విక్టరీనే కొట్టింది. 8 వికెట్ల తేడాతో ఘన విజయాన్ని నమోదు చేసింది.

లక్నో వేదికగా జరిగిన మ్యాచ్ లో టాస్ ఓడి మొదటి బ్యాటింగ్ చేసిన చెన్నై నిర్ణీత 20 ఓవర్లలో చెన్నై 6 వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది. వాస్తవానికి చెన్నైకి శుభారంభం లభించలేదు. రెండో ఓవర్ లోనే రచిన్ రవీంద్ర డకౌట్ అయ్యాడు. ఆ కొద్దిసేపటికే రుతురాజ్ (17) పెలివియన్ చేరాడు. దీంతో తొలి 5 ఓవర్లకు చెన్నై స్కోర్ 42/2. ఆ తర్వాత కూడా చెన్నై కి గుడ్ స్టార్ట్ కాలేదు. శివమ్ దూబె(3), రిజ్వీ(1) నిరాశపరిచారు. అయితే రవీంద్ర జడేజా (57*) జట్టును ఆదుకున్నాడు. అతనికి తోడు మ్యాచ్ కి మధ్యలో రహానె(36), మొయిన్(30), ఆఖర్లో ధోనీ(28*) రాణించడంతో.. చెన్నై 176 పరుగులు చేయగలిగింది. లక్నో బౌలర్లలో కృనాల్ 2 వికెట్లు పడగొట్టాడు. మోసిన్, యశ్, రవి, స్టొయినిస్ తలో వికెట్ తీశారు. ఇక 177 పరుగుల టార్గెట్ తో బరిలోకి దిగిన లక్నో మొదట్లో ఆచితూచి ఆడింది. మొదటి 5 ఓవర్లకు లక్నో స్కోర్ 43/0. ఆ తర్వాత గేర్ మార్చింది. కేఎల్ రాహుల్ (82: 53 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సలు), డికాక్ (54 : 43 బంతుల్లో 5 ఫోర్లు, ఒక సిక్స్) చెలరేగి ఆడారు. 15 ఓవర్ల వరకు లక్నో



మొదటి వికెట్ కోల్పోలేదు. ఆ తర్వాత చెన్నై టైట్ చేసే ప్రయత్నం చేసినా.. అప్పటికే జరగాల్సిన డ్యామేజ్ జరిగిపోయింది. ఆఖరి రెండు ఓవర్లలో లక్నో విజయానికి 12 పరుగులు అవసరం కాగా.. 19 ఓవర్ లోనే టార్గెట్ ను ఫినీష్ చేశారు. దీంతో మరో ఓవర్ మిగిలి ఉండగానే 8 వికెట్ల తేడాతో లక్నో గ్రాండ్ విక్టరీ కొట్టింది.

## పక్కా ప్లాన్‌తో లక్నో..

భయంకరమైన హిట్టర్లు ఉన్న చెన్నై ని ఓడించడం అంత ఈజీ కాదు. అయితే చెన్నై ని ఓడించేందుకు లక్నో గట్టిగా హోం వర్క్ చేసి వచ్చినట్టుంది. ప్లాన్స్ ను పక్కాగా ఎగ్జిక్యూట్ చేసి రిజల్ట్ రాబట్టారు. ముఖ్యంగా పవర్ ప్లేలో చెన్నైని కట్టడి చేయడంతో పాటు కీలక వికెట్లు పడగొట్టారు. ఓపెనర్ రచిన్, హార్డ్ హిట్టర్ దూబెను వల పన్ని మరీ అవుట్ చేసినట్టు అనిపించింది. ఇక బ్యాటింగ్ లోనూ ఏమాత్రం తొందర పడలేదు. వికెట్లు ఇవ్వకుండా చెన్నై బౌలర్లను ఒత్తిడిలోకి నెట్టి.. పని పూర్తి చేశారు.

